క్లుప్తంగా

విధుల్లోకి అంగన్‌వాడీలు



సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం విధుల్లో చేరారు. ఈ మేరకు సీడీపీఓ పచ్చవ లావణ్యకు వినతి పత్రం అందించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఉదయగిరి ప్రాజెక్ట్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో 206 అగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 113 మంది విధుల్లో చేరారన్నారు. కేంద్రాలను నిర్వహిస్తున్నారన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

అల్లూరు: మండలంలో పంచాయతీల వారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీఓ జ్యోతి తెలియజేశారు. ఈ మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ శశిరేఖతో కలిసి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో అభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి ప్రస్తుతం మనకు ఉన్న పథకాలు, నవరత్నాలు, ఉపాధి హామీ పథకం, నాడు–నేడు, జల్‌జీవన్ మిషన్, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన పథకాల ద్వారా సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి



మృతి చెందిన చుక్కల దుప్పి

సోమశిల: అడవి నుంచి చెరువులో తాగునీటి కోసం వచ్చి రోడ్డు దాటుతున్న చుక్కల దుప్పిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. ఈ ఘటన అనంతసాగరం మండలం మంచాలపల్లి శివారు చెరువు కట్ట వద్ద బుధవారం జరిగింది. గుర్తించిన స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుప్పి కళేబరాన్ని సమీపంలో ఖననం చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

అభయాంజనేయుడికి చెర్రీలతో అలంకరణ



చెర్రీ పండ్ల అలంకారంతో అభయాంజనేయస్వామి

సంగం: మండలంలోని జంగాలదొరువు కొండపై కొలువైన ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో కనుమ పండగ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని చెర్రీ పండ్ల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన పండరీ భజన భక్తులను ఆకట్టుకుంది. చెన్నైకు చెందిన ఎదురు బాలాజీ, విజయలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఉదయగిరి: మండలంలోని జి.చెరువుపల్లి, జి.చెర్లోపల్లి గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ జరిగింది. ఎంపీడీఓ డీ.ఈశ్వరమ్మ మాట్లాడుతూ సంకల్పయాత్ర ద్వారా పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల జీవన ప్రమాణాలు మెరుగు పర్చేందుకు కోట్లాది రూపాయలు వివిధ పథకాల కోసం ఖర్చు చేస్తుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు టి.శ్రీనివాసులు, వినీత, తేజస్విని, ఖాజారంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా పశు వైద్యం

ఆరోగ్యశ్రీ తరహాలోనే పశువుల వైద్యానికి, సంరక్షణ హెల్త్ కార్డులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తోంది. ఈ కార్డుపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ పశువులకు సంబంధించిన డేటా ఓపెన్ అవుతుంది. అందులో ప్రధానంగా వైద్య సేవల సమాచారం నిక్షిప్తం చేసి ఉంటుంది. ఏ పశువుకు ఎప్పుడు ఎలాంటి వైద్య సేవలు అందించాలి, ఏం అందించారు, పశువు ఆరోగ్యం తదితర విషయాలు మొబైల్ యాప్ ద్వారా ఒక్క క్లిక్‌తో తెలుసుకునే అవకాశం ఉంటుంది.

- మూగ జీవులకు హెల్త్ కార్డులు
- ఇక నుంచి క్షణాల్లో వైద్య సేవలు
- ఆరు పెద్ద పశువులకు ఒక కార్డు
- 20, గొర్రెలు, మేకలకు కలిపి ఒక కార్డు



పశు ఆరోగ్య సంరక్షణ కార్డు

దుత్తలూరు: పశు వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. మూగ జీవాలకు మరింత మెరుగైన వైద్య సేవలు పక్కాగా అందేలా చర్యలు తీసుకుంది. ఇందు కోసం పశువుల ఆరోగ్య సంరక్షణకు ఆరోగ్య కార్డులు జారీ చేస్తోంది. పశువుల సంఖ్య, వాటికి కావాల్సిన మందులు, ఇతర అంశాలను ఆన్‌లైన్ చేసి క్యూఆర్ కోడ్‌తో కూడిన 10 అంకెల సంఖ్యతో పొందుపరచిన గుర్తింపు ఇస్తున్నారు. మొబైల్ యాప్ ద్వారా ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ నంబరుతో ఎన్ని జీవాలున్నాయి, రైతు ఎవరు, పశువులకు ఎలాంటి వ్యాధులున్నాయి వంటి వివరాలన్నీ తెలుస్తాయి. పశువైద్యశాఖ అధికారులు ప్రతి పశువుకు కార్డు ఇవ్వకుండా 6 పెద్ద పశువులకు ఒక ఆరోగ్య కార్డు అందజేస్తున్నారు. మేకలు, గొర్రెలైతే 20 జీవాలకు ఒక ఆరోగ్య కార్డు అందిస్తున్నారు. ప్రధానంగా ఇందులో పశువుల ఆరోగ్య సమాచారం పొందుపరచి ఉంచుతున్నారు. ఒకప్పుడు పాడవాటి కరపత్రంలా ఉండేది. ప్రస్తుతం జారీ చేస్తున్న కార్డు హ్యాండ్ బుక్ సైజ్‌లో ప్రింట్ చేసి పాడి రైతులకు అందిస్తున్నారు. ఆర్బీకేల్లో పశువైద్య సిబ్బంది వీటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నారు.

ఉపయోగాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ తరఫున 2 రకాల కార్డులు జారీ చేస్తోంది. అందులో ఒకటి పశు ఆరోగ్య సంరక్షణ కార్డు. ఇది ఆరు గేదెలు లేదా ఆరు ఆవులు, పోతులకు మాత్రమే వర్తిస్తుంది. రెండోది గొర్రెలు, మేకలకు సంబంధించిన ఆరోగ్య సంరక్షణ కార్డు. ఇది ఇరవై జీవాలకు వర్తిస్తుంది. ఇందులో పశువులను పోషించే పశుపోషకుడి వివరాలు, పశు సంపద వివరాలు ఉంటాయి. వ్యాధుల నుంచి టీకాల వరకు సమస్త సమాచారం కార్డులో నిక్షిప్తమై ఉంటుంది. మూగ జీవాలకు ఏవైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఈ కార్డుతో చికిత్స అందించడం సులభమవుతుంది.

జిల్లాలో పశువులు		
గేదెలు	:	6,46,106
ఆవులు	:	57,774
మేకలు	:	3,86,929
గొర్రెలు	:	10,98,197

ఎంతో ఉపయోగం



పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పశువులు, గొర్రెలు, మేకలకు అందజేసే వైద్య వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుంది. రైతులందరికీ వీటిని ప్రభుత్వం అందజేస్తుంది. దీంతో రైతులకు అన్ని సేవలు ఉచితంగా అందుతున్నాయి.

– సింగవరపు హైమావతి, దుత్తలూరు

పశువుల ఆరోగ్యానికి రక్ష



పశువులకు హెల్త్‌కార్డులు అందజేయడం కొత్తగా ఉంది. వీటి వల్ల పశువులకు ఎలాంటి అనారోగ్యం వచ్చినా క్షణాల్లో చికిత్స అందించడానికి వీలవుతుందని పశు వైద్యులు తెలిపారు. కార్డుల్లో గతంలో అనారోగ్యానికి గురైనప్పుడు అందజేసిన చికిత్స వివరాలు కూడా అందులో ఉంటాయి. కాబట్టి ఎలాంటి వైద్యం చేయాలో వైద్యులు, సిబ్బందికి వెంటనే తెలుస్తుంది. ఇలాంటి సౌకర్యం పాడి రైతులకు అందజేయాలన్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం గొప్పది.

– వాసిపల్లి సుబ్బారెడ్డి, దుత్తలూరు

రైతులందరూ వినియోగించుకోవాలి



పశు, జీవాల పోషకులు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలి. ఇందులో రైతు వివరాలతో పాటు ప్రత్యేకంగా ఓ నంబరు కేటాయిస్తారు. ఏఏ సమయాల్లో ఎటు వంటి టీకాలు వేయాలో.. వేశారో ఆ వివరాలు ఇందులో పొందుపరుస్తారు. అంతేకాక రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వెంటనే చికిత్స అందించేందుకు వీలుంటుంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఏడీ పశుసంవర్ధక శాఖ, దుత్తలూరు

సుస్థిర ప్రణాళికలతో సమగ్రాభివృద్ధి



గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: సచివాలయాల స్థాయిలో సుస్థిర ప్రణాళికలతో పని చేయడం ద్వారానే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం 2024–25 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులను భాగస్వామ్యులను చేయడం ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో పాటు గ్రామ పంచాయతీ ఆదాయ వనరులను కూడా అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈఓఆర్డీ ఉషారాణి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి సత్ఫలితాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనర్లు శ్రీను, వేణు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సమావేశంలో పాల్గొన్న వారికి అవగాహన కల్పించారు.

అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డిజిటల్ సహాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ముందస్తుగా అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకుని అమలు పర్చాలన్నారు. పంచాయతీలో సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకుని 25వ తేదీన గ్రామ సభలు నిర్వహించుకుని అప్రూవల్ చేసుకుని, 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గ్రామ సభలు తప్పని సరిగా నిర్వహించాలన్నారు. ఈఓపీఆర్డీ ఎస్.మల్లికార్జున, ఏఓ సీహెచ్ రేణుక, ఎంసీఓ గాజుల ఇమ్రాన్ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుములు అందజేస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని బాలచౌడేశ్వరి దేవస్థానం వద్ద బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా ఎఫ్3 ఫేం సినీ ఆర్టిస్ట్ పులి సీతామాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులు ప్రదానం చేశారు.

ఆనందాల వేదిక.. ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

మర్రిపాడు: 2007–08 సంవత్సరంలో మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యభ్యసించిన విద్యార్థిని విద్యార్థులందరూ ఒకే వేదిక దగ్గరకు చేరుకుని ఆహ్లాదకర వాతావరణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బుధవారం జెడ్పీ ఉన్నత పాఠశాల ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వేదికగా మారింది. అప్పటి మధుర జ్ఞాపకాలు నెమర వేసుకుంటూ ఆనందోత్సవాలు కబుర్లు చెప్పుకుంటూ ఉపాధ్యాయులతో అప్పుడు చేసిన చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ రోజంతా తిరిగి మునపటి బాల్యంలోకి వెళ్లిపోయారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. అందరూ కలిసి కట్టుగా చేతిలో చేయి వేసుకుని గుర్తున్న వారిని, గుర్తు లేని వారిని చూసి ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాలలో చక్కర్లు కొట్టారు. సుమారు 15 ఏళ్ల క్రితం చదివిన విద్యార్థిని విద్యార్థులు, గురువులు మళ్లీ అదే పాఠశాలలో ఒకే దగ్గర కలవడంతో సెల్ఫీలు తీసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఈ కార్యక్రమంలో పాలు పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, దేశ నలుమూలల ఉద్యోగ రీత్యా ఎక్కడెక్కడో ఉంటున్న తమను ఈ వేదిక దగ్గర కలిపేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పంచముఖ శక్తి గణపతికి విశేష పూజలు



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లిలో కొలువైన పంచముఖ శక్తి గణపతికి ముక్కనుమను పురస్కరించుకుని నందవరం గ్రామానికి చెందిన మాచిరాజు రమణరాజు కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహా విగ్రహావిష్కరణ 19వ తేదీ జరగనుందని, ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకట రమణమ్మ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.404 కోట్ల వ్యయంతో నిర్మించిన 125 అడుగుల భారీ కాంస్య అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అందరూ జయప్రదం చేయాలన్నారు. అన్ని రకాల అభివృద్ధి పనులతో నిర్మించిన ఈ కాంస్య విగ్రహ ఆవరణలో 3 వేల మంది కూర్చొనే మల్టీ కన్వెన్షన్ హాలు, ఓపెన్ థియేటర్, లైబ్రరీ, ధ్యానం కోసం ప్రత్యేక మందిరం, పూర్తి స్థాయిలో గ్రీనరీ చేసి ఉన్న ఈ సముదాయాన్ని అద్భుతమైన కళా ఖండంగా రాష్ట్ర ప్రభుత్వం తీర్చిదిద్దిందన్నారు. ఇందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు నుంచి ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆంద్రా రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నోటి వినయ్‌కుమార్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఐవీ రమణారెడ్డి, కె హరికిషోర్, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

ఆత్మకూరు: పట్టణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ఆటల పోటీల విజేతలకు బుధవారం ప్రముఖ వైద్యురాలు షకీల బహుమతులు పంపిణీ చేశారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 13వ తేదీ నుంచి ఆటల పోటీలు జరుగుతున్నాయి. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను, షీల్డ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నేత నందా శ్రీను, ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు ఖాదర్‌బాషా, సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, షేక్ సందానీ, హజరత్తయ్య, రెడ్ క్రాస్ కార్యదర్శి సాధిక్‌హుస్సేన్ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న మేకపాటి

- సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వరికుంటపాడు: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జి.కొండారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన గడప గడపకు వెళ్లి ఆయా కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల పొందిన సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లు అందించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండానే ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డారన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యశ్రీలో గతంలో ఉన్న రూ.5 లక్షల వైద్య ఖర్చుల నగదును ఏకంగా రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎన్నో రకాల విలువైన సర్టిఫికెట్లను ఉచితంగా అందించారన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపించే జగన్ వంటి సీఎంను ఇప్పటి వరకు చూడలేదన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో సైనికుల్లా పని చేసి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలన్నారు. ఒక్కసారి అవకాశం కల్పిస్తే నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామాల్లో నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, మినీ లైబ్రరీల ఏర్పాటుతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించేలా ప్రజలు సహకరించాలన్నారు. ముందుగా మండలంలోని గొల్లపల్లికు చెందిన వెంగయ్య ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీకి చెందిన యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మేకపాటి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ ఆర్.నాగేంద్ర, వైస్ ఎంపీపీ డి.మధు, నాయకులు అలిఅహ్మద్, తిరుపతినాయుడు, ఎం.వీరారెడ్డి, ఎం.శ్రీనివాసులు, నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చెన్నారాయుడు, పి.మల్లికార్జున పాల్గొన్నారు.

నేతలతో మేకపాటి ఆత్మీయ పలకరింపు



పుల్లాయపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లిలో బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి ఎందుకు తెచ్చుకోవాలో వివరించారు. జగనన్నను సీఎంగా చేసుకోకపోతే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందే పరిస్థితి లేదని వివరించారు. దీంతో గ్రామస్తులు, మహిళలు తమ పూర్తి మద్దతు జగన్‌మోహన్‌రెడ్డికేనని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబులరెడ్డి, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మూలె వెంకటసుబ్బారెడ్డి, సోమిరెడ్డి, కల్లూరు రమణారెడ్డి, కంభాల భాస్కర్ రెడ్డి, గాజుల ఫారుఖ్ అలి తదితరులున్నారు.

అయోధ్య అక్షతలు అందజేత



గిరిజనకాలనీలో అయోధ్య అక్షతలను అందజేసిన వీహెచ్‌పీ నేతలు

ఆత్మకూరు: త్వరలో ప్రారంభం కానున్న అయోధ్య భవ్య రామమందిరం నుంచి వచ్చిన పవిత్ర అక్షతలను ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అనంతరాయనియేనిలోని (గిరిజనకాలనీ) అందజేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి పలువురు భక్తులతో కలిసి బుధవారం కాలనీకి మంగళవాయిద్యాలతో అక్షతలను ఊరేగింపుగా చేర్చి రామాలయంలో పూజల అనంతరం జైశ్రీరామ్ నినాదాలతో ఇంటింటికి అక్షతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, శంకర్ రెడ్డి, కె.చంద్రారెడ్డి, వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రానికి చేరుకున్న బాలింతలు, గర్భిణులు

ఆత్మకూరు: గత నెల రోజులకుపైగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండడంతో ఆ కేంద్రాలు మూత పడిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆ కేంద్రాల పరిధిలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేయిస్తోంది. బుధవారం వెంకట్రావుపల్లి గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వీఆర్‌ఓ రంతుల్లా ఆ పరిధిలోని లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేశారు.

ఖోఖో విజేత యనమదల మహిళల జట్టు



చేజర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో జరుగుతున్న మహిళలు ఖోఖో ఆట

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన ఆడుదాం ఆంధ్రా ఖోఖో క్రీడలో యనమదల మహిళల జట్టు మండల విజేతగా నిలిచింది. బుధవారం 14 సచివాలయాల నుంచి హోరాహోరీగా జరిగాయి. పురుషుల ఖోఖో విభాగంలో ఆదూరుపల్లి జట్టు రాగా ఆ జట్టే విజేతగా నిలిచింది. కాగా మహిళా ఖోఖో పోటీల్లో యనమదల జట్టుతో మిగతా టీమ్స్ హోరాహోరీగా పోరాడాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్‌కే కరిముల్లా, మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పి మల్లికార్జున, మడపల్లి పీఎస్ మహేష్ పాల్గొన్నారు.

నకిలీ సాదాబైనామాతో మరొకరికి హక్కులు

- తహసీల్దార్‌ను నిలదీసిన వృద్ధ దంపతులు
- సిబ్బందితో బయటకు గెంటించిన వైనం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ ఆధారాలు చూపుతున్న బాధిత దంపతులు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు గ్రామ సర్వే నంబరు 627లో తాను అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసి అనుభవిస్తున్న 6 ఎకరాల భూమిని ఇతరులకు ఎలా సాదా బైనామా ద్వారా హక్కులు కల్పిస్తారంటూ బుధవారం బాధితులు పసుపులేటి రమణయ్య దంపతులు తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబును నిలదీశారు. దీంతో ఆగ్రహం చెందిన తహసీల్దార్ వారిని కార్యాలయం నుంచి బయటకు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు సేవలు అందించాల్సిన తహసీల్దార్ తమకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే వృద్ధులని కూడా చూడకుండా బయటకు పంపడం వివాదాస్పదంగా మారింది. వృద్ధ దంపతులు మాట్లాడుతూ గతంలో కూడా తాము అనేక సార్లు తమ వద్ద ఉన్న ఆధారాలతో తహసీల్దార్ రవీంద్రబాబును కలిసి హక్కులు కల్పించాలని కోరినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని వాపోయారు. తమ ప్రత్యర్థి వద్ద భారీ మొత్తంలో లంచం తీసుకుని తమకు అన్యాయం చేశారంటూ బాధితులు వాపోయారు. తమకు జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మరికొద్ది రోజుల్లో బదిలీ కానున్న తహసీల్దార్ లంచం తీసుకుని తమకు అన్యాయం చేస్తున్నారని బాధితులు కన్నీరు మున్నీరువుతున్నారు.